
ప్రజాశక్తి



శనివారం 6 జనవరి 2024 | 5 | విజయనగరం

తప్పని డోలి మోత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేక గిరిజనులకు ఏ చిన్న కష్టమొచ్చినా డోలి మోత తప్పడం లేదు. మూలబొడ్డవర పంచాయతీ చిట్టంపాడు గ్రామానికి చెందిన మాదల గంగమ్మ, ఆమె చంటి బిడ్డ తీవ్ర అనారోగ్యం బారినపడ్డారు. దీంతో భర్త గంగులు తోటి గిరిజనుల సహాయంతో శుక్రవారం వారిని డోలిలో మోసుకుంటూ వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



డోలితో తల్లి,బిడ్డను తీసుకొస్తున్న గిరిజనులు

గడ్డితిని బతకాలా?

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసనలు • 11వ రోజుకు సమ్మె



రాజాంలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు 300 శాతం పెరిగితే, మున్సిపల్ కార్మికుల జీతం 24 శాతం మాత్రమే పెరిగిందని, ప్రస్తుత ధరల్లో కార్మికుల గడ్డితిని బతకాలా అంటూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో కార్మికులంతా గడ్డితింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెల్లిమర్ల, రామతీర్థాలు, ముషిడిపల్లి మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు నెల జీతం రూ.11వేలు ఇచ్చి శ్రమదోపిడీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 7 ప్రకారం 18వేలు జీతం చెల్లించాలని, మెన్, మెటీరియల్ వేరు చేస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కార్పొరేటర్లకు వినతి పత్రాలు ఇస్తామని, స్పందించకపోతే జనవరి 6 తర్వాత ఏ రోజు నుంచైనా మంచినీటి పంపింగ్ బంద్ చేసి సమ్మెలోకి వెళ్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేస్తున్న కుట్రలను ఖండిస్తూ జనవరి 6న మున్సిపల్ కార్యాలయాల వద్ద, జనవరి 8న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలకు ఎఐటియుసి (అనుబంధ కార్మిక సంఘం) కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెకు సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, రెల్లి కులస్తుల సంక్షేమ సంఘం నాయకులు సోము మురళి విజయ్ మద్దతు ప్రకటించారు. మున్సిపల్ యూనియన్ నాయకులు భాస్కరరావు, రజిని, రామచంద్రరావు, కుమారి ,రాఘవ ,మురళి , అరుణ గౌరీ అర్జున్ మజ్జు కష్టమ్మ లక్ష్మి, అప్పయమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన

ఎఐటియుసి అనుబంధ సంఘం కార్మికులు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన శిబిరంలో మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు,బుగత అశోక్ మాట్లాడారు.

బొబ్బిలి : మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ శుక్రవారం పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మె శుక్రవారం కొనసాగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.గౌరీష్, కార్మికులు పాల్గొన్నారు.

రాజాం : స్థానిక అంబేద్కర్ కూడలిలో నగర పంచాయతీ కార్మికులు పొర్లుదండాలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తినాయుడు, యూనియన్ నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, హరి, మరియదాసు, అప్పలరాజు పాల్గొన్నారు.

చెత్త బండి అడ్డగింత

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో నగర పంచాయతీ కార్యాలయం నుంచి చెత్త సేకరణ బండితో అధికారులు బయటకు వస్తుండగా, కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ నగర పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఇతరులతో పని ఎలా చేయిస్తారని నిలదీశారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు టి.బాబూరావు, బి.హరిబాబు, జె.శ్రీను, బి.రాము, టి.లక్ష్మి పాల్గొన్నారు.



చెత్త బండిని అడ్డుకుంటున్న నాయకులు, కార్మికులు

ఆందోళనలో రైతులు

పరిహారం చెల్లింపునకు మీనమేషాలు

అసలే అరకొర లెక్కలు... ఆపై నష్టపరిహారం చెల్లింపునకు మీనమేషాలు. దీంతో మిచౌంగ్ తుపాను కారణంగా పంటనష్టపోయిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట ఇంటికి చేరితో ఈపాటికే నలగురిలా ధాన్యం డబ్బు చేతికి అందేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తడిసిన వరిచేను ఎత్తుతున్న రైతు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని 2,83,912 ఎకరాల్లో సాగవ్వగా, అత్యధికంగా వరి 2,34,437 ఎకరాల్లో సాగైంది. మిచౌంగ్ తుపాను గత నెలలో నాలుగు రోజులు పాటు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. వేలాది ఎకరాల్లో వరి నీట మునిగిపోయినప్పటికీ నష్టగణనలో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకోలేదు. కేవలం నేలకు ఒరిగిపోవడం లేదా మునిగిపోవడం వంటివాటినే ప్రామాణికంగా తీసుకున్నారు. దీంతో, కేవలం 667 ఎకరాల్లో 1059 మంది రైతులు మాత్రమే నష్టపోయినట్టు అధికారులు గుర్తించారు. వీరికి రూ.50.62లక్షలు ప్రభుత్వం నుంచి అందాల్సివుంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు కలిపి రూ.70లక్షల మేర నష్టపరిహారం అందాల్సివుందని, త్వరలోనే చెల్లిస్తామని వారం రోజుల క్రితం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పిన విషయం విధితమే. పండగ దగ్గర పడుతున్నా పరిహారం చెల్లించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపాను నష్టం వల్ల అందరిలా సంక్రాంతి పండగ చేసుకునే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. పంటనష్టం వాటిల్లిన మండలాల్లో ప్రధానంగా భోగాపురం మండలంలో 386 ఎకరాల వరి నీటమునిగింది. మరో 224 ఎకరాల్లో వరి గాలి, ఎన్ను బరువెక్కడంతో పర్తిగా నేలకొరిగింది. చీపురుపల్లి మండలంలో 125 ఎకరాలు నీట మునిగిపోయింది. గుర్ల మండలంలో 600 ఎకరాల్లో పంటనష్టం ఉంటుందని అంచనా. రేగిడి మండల వ్యాప్తంగా సుమారు 2,700 ఎకరాలు, నెల్లిమర్లలో 450 ఎకరాల మేర అతివృష్టి వెంటాడింది. మెరకముడిదాం, తెర్లాం మండల్లాల్లో 20 ఎకరాల చొప్పున, బాడంగిలో 14 ఎకరాలు చొప్పున నష్టం జరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో, చేతికి అందొచ్చిన పంట వర్షార్పణ అయిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పరిహారమైన వస్తుందని ఎదురు చూస్తున్న వీరికి సంక్రాంతికి నిరాశే మిగలనుంది.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

అక్రమ అరెస్టులకు నిరసనగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చలో విజయవాడ తరలివెళ్లారు. అయితే వారిని పోలీసులు విజయవాడలో అక్రమంగా నిర్బంధించి అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కె.త్రినాధరావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని 17రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ముఖ్య మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని చలో విజయవాడ కు వెళ్తే పోలీసులు అన్యాయంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే ఉద్యమం మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్యను చిత్రహింసలు పెట్టి..వాటర్ ట్యాంకుపై నుంచి దూకి

ఉన్మాది ఆత్మహత్య



తీవ్రగాయాలతో గంగతల్లి

ప్రజాశక్తి-వేపాడ

భార్యను చిత్రహింసలకు గురిచేసి, ఆపై ఆత్మహత్యకు పాల్పడ్డాడో ఉన్మాది. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని బల్లంకి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బల్లంకి గ్రామానికి చెందిన చెలిబోని ఈశ్వరరావు (40) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ బాధ్యతను విస్మరించి, భార్య గంగతల్లి, కుమార్తెను హింసించడం అలవాటుగా చేసుకున్నాడు. తాగితే కుటుంబాన్ని ఎలా పోషించాలి? ఏదైనా పనికి వెళ్లాలని భార్య అడిగితే, ఆమెను కొట్టేవాడు. ఈ నేపథ్యంలో గంగతల్లి వల్లంపూడి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గురువారం ఈశ్వరరావును స్టేషన్‌కు పిలిపించి, ఇకపై సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటామని మందలించి, పంపించేశారు. దీన్ని జీర్ణించుకోలేని ఈశ్వరరావు ఉన్మాదిగా మారాడు. అదేరోజు రాత్రి ఇంటి వద్ద కక్కిరి మట్టతో ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా గాయాలైన ఆమె కేకలు వేయడంతో కక్కిరి మట్టతో పీక కోసి, అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు ఆమెను విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో ఈశ్వరరావు ట్యాంకుపై నుంచి దూకడంతో అక్కడికక్కడే మరణించాడు. శరీరమంతా తీవ్ర గాయాలు కావడంతో గంగతల్లి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆమెకు సుమారు 60 కుట్లు పడ్డాయి. ఈశ్వరరావు తమ్ముడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బివి రమణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.



మృతిచెందిన ఈశ్వరరావు

వివేకానంద మృతిపై వాస్తవాలు బయటకు రావాలి

మాజీమంత్రి సుజయకృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న వైఎస్ వివేకానంద రెడ్డి మృతిపై వాస్తవాలు బయటకు రావాల్సిన అవసరం ఉందని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు అన్నారు. శుక్రవారం బొబ్బిలి కోటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ షర్మిల కాంగ్రెసులో చేరికపై ఆయన స్పందించారు. చిన్నాన్న మృతిపై వాస్తవాలు షర్మిల ద్వారా బయటకు రావాలన్నారు. వైసిపి స్థాపించిన తర్వాత జగన్మోహన్ రెడ్డి జైల్లో ఉంటే షర్మిల పాదయాత్ర చేసి, ఆ పార్టీని ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు. లేకుంటే జగన్మోహన్ రెడ్డి జైల్లో ఉండి పార్టీని నడిపే స్థితి లేదని చెప్పారు. కాంగ్రెసులో చేరడం షర్మిల వ్యక్తిగత విషయమని, కానీ ప్రజలు గతంలో వైసిపిని నడిపించిన ఆమె వెంట ఉంటారా? లేక పార్టీని స్థాపించిన జగన్ వెంట నడుస్తారో వేచి చూడాలన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు శరత్, నాయకులు ఉన్నారు.

ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలుగా ఎంవిజిఆర్, జెఎన్‌టియు

అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికలకు స్ట్రాంగ్ రూముల పరిశీలన

విజయనగరం : వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఇవిఎంలను భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం శుక్రవారం కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ఎంవిజిఆర్ కళాశాలలో 5 నియోజక వర్గాలకు , జె.ఎన్‌టియులో రెండు నియోజక వర్గాలకు సంబంధించి శాసన సభ, పార్లమెంట్‌కు ఒకే చోట స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్‌కు వీలుగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని యాజమాన్యాలను కలెక్టర్ కోరారు. రెండు చోట్ల రూము లను తనిఖీ చేశారు. ఇంకోసారి పరిశీలించిన తర్వాత ఫైనలైజ్ చేస్తామని, తర్వాత అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాటు చేయవలసి ఉంటుందని యాజమాన్యాలతో చెప్పారు. ఎంవిజిఆర్‌లో డైరెక్టర్ సీతా రామ రాజు, మోహన్, జెఎన్‌టియు లో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య ఎన్నికల కోసం అవసరమైన గదులను, రూట్ మ్యాప్‌లను కలెక్టర్ కు చూపిం చారు. కలెక్టర్ వెంట జెసి మయూర్ అశోక్ , డిఆర్ఒ అనిత, ఆర్‌డిఒ సూర్య కళ, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పలు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 28 అంశాలు పొందుపరచగా వాటిలో ఒక్క అంశానికి తప్పా మిగతా 27 అంశాలకు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. టెండర్ల ప్రక్రియ ఖరారైన వెంటనే పనులు పూర్తిచేసే విధంగా చొరవ చూపాలని మేయరు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వి వి రాజేష్ అన్నారు. అభివద్ధి పనుల్లో పూర్తి పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. సమావేశంలో కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

1820 మందికి రూ.2.62 కోట్ల లబ్ధి



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ కారణాలవల్ల సంక్షేమ పథకాలు అందకుండా మిగిలిపోయిన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రతీ ఆరునెలలకు ఒకసారి వివిధ పథకాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అర్హత ఉన్నవారు ఏ ఒక్కరు కూడా పథకాలకు దూరం కాకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందులో భాగంగా మిగిలిపోయిన లబ్ధిదారులకు పథకాలను విడుదల చేసింది. జిల్లాకు చెందిన 1820 మంది లబ్ధిదారులకు సుమారు రూ.2.62 కోట్లు విలువైన పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. తాడేపల్లిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేశారు. జిల్లా నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు. జిల్లాలో బిసి కార్పొరేషన్ పరిధిలో వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద 60 మందికి రూ.9లక్షలు, వైఎస్ఆర్ కాపునేస్తం కింద 25 మందికి రూ.3.75 లక్షలు, జగనన్న చేదోడు కింద 718 మందికి రూ.71.80 లక్షలు, రవాణా శాఖ ద్వారా వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం కింద 117 మందికి రూ.16.60 లక్షలు, మత్స్యశాఖ పరిధిలో మత్స్యకార భరోసా పథకం కింద 44 మందికి రూ.4.40 లక్షలు, విద్యాశాఖ ద్వారా జగనన్న అమ్మ ఒడి పథకం కింద 780 మందికి రూ.1.10 కోట్లు, చేనేత జౌళిశాఖ ద్వారా వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద ఒక్కరికి రూ.0.24లక్షలు, సాంఘిక సంక్షేమం ద్వారా వైఎస్ఆర్ కల్యాణ మస్తు, షాదీ తోఫా పథకం కింద 75 జంటలకు రూ.45.95లక్షలు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. దీనికి సంబంధించి మొత్తం 1820 లబ్ధిదారులకు రూ.2కోట్ల, 62లక్షల, 13వేల విలువైన చెక్కును జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి నిర్మలాదేవి, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు, ఇతర అధికారులు, వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి పర్షోత్తమ్ పర్యటన

చింతపల్లిలో మత్స్యకారులతో ముఖాముఖి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి శాఖల మంత్రి పర్షోత్తమ్ రూపాలా శనివారం జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కేంద్ర మంత్రి పూసపాటిరేగ మండలం చింతపల్లి గ్రామానికి శనివారం మధ్యాహ్నం 3గంటలకు చేరుకొని అక్కడి మత్స్యకారులతో మాట్లాడుతారు. వారికి అమలు చేస్తున్న పి.ఎం.మత్స్యవందన యోజన తదితర పథకాల అమలు తీరును తెలుసుకుంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర మత్స్య, పాడిపరిశ్రమ శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.



రైస్ మిల్లు యజమానితో మాట్లాడుతున్న అధికారులు

రైసుమిల్లులపై దాడులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కొండలమామిడివలస, అంబకండి, పారంపేట, కోడిస గ్రామాల్లో ఉన్న రైసుమిల్లులపై అధికార యంత్రాంగం గురు, శుక్రవారాల్లో దాడులు చేపట్టింది. ఈ నెల 4న 'ధాన్యం రైతులు గగ్గోలు' అనే కథనం ప్రజాశక్తిలో ప్రచురించడంతో జిల్లా యంత్రాంగంలో ప్రకంపనలు పుట్టించింది. కలెక్టర్ నాగలక్ష్మి, డిఎస్ఒ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఎడి కె. చంద్రరావు, తహశీల్దార్ సుదర్శన్‌రావు, ఎఒ గిరడ మురళీకృష్ణ రైస్‌మిల్లులపై దాడులు చేశారు. అక్కడ ఉన్న కొంతమంది రైతులతో అధికారులు మాట్లాడి, వివరాలు సేకరించారు. కొంతమంది రైతులతో మాట్లాడితే దోపిడీ నిజమేనని చెప్పారు. ప్రభుత్వ నిబంధన మేరకు 80 కేజీలు మాత్రమే తీసుకోవాలని, అదనంగా తీసుకుంటే రైస్‌మిల్లులను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

బొబ్బిలి : ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు జి.శశిభూషణరావు, రాంనరేష్, రవిశంకర్, సాయికష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంప్ హౌస్ కార్మికులకు జిఒ 7 ప్రకారం వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రామతీర్థాలు, ముషిడిపల్లి, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులను మెన్, మెటీరియల్ నుంచి వేరుచేసి జీవో నెంబర్ 7 ప్రకారం రూ.18వేలు జీతం చెల్లించేలా కౌన్సిల్‌లో తీర్మానం చేయించాలని కోరుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మికి, కమిషనర్‌కి, వైసిపి ఫ్లోర్ లీడర్ ఎస్ వివిరాజేష్, కార్పొరేటర్ నారాయణరావుకు శుక్రవారం కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన వినతులు ఇచ్చారు. కోలగట్ల వీరభద్ర స్వామి స్పందిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేయిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు, నాయకులు మురళి, అరుణ్, గౌరీ, నారాయణరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

7న బిసి సామాజిక చైతన్య సభ

ప్రజాశక్తి-విజయనగరం కోట


ఈనెల 7న విశాఖలో బిసి సామాజిక చైతన్య సభను విజయవంతం చేయాలని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ఇమంది సుధీర్ తెలిపారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర ఒబిసి అధ్యక్షులు రొంగళి గోపి శ్రీనివాస్ సారథ్యంలో ఈనెల జనవరి 7న విశాఖపట్నంలో ఉత్తర ఆంధ్ర బిజెపి బిసి సభ జరుగుతుందని తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అర్బన్ హెల్త్‌సెంటర్ల ప్రారంభంలో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం నగరంలోని కెఎల్ పురం, ఎల్‌బి నగర్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మీడియాతో మాట్లాడుతూ నగరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్య ఇస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా నగరంలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కావడంతో పాటు తరగతులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో అందరికీ వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డిఎంహెచ్ఒ భాస్కరరావు, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి

ఆపదలో ఉన్న వారికి అండగా

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 16 లక్షల 80 వేల రూపాయల విలువగల చెక్కులను బాధితులకు అందించారు. బియ్యాల పేటకు చెందిన భవానికి ఎనిమిది లక్షల రూపాయలు, జొన్నవలసకు చెందిన రవితేజకు రూ.4లక్షలు, కోరుకొండకు చెందిన అప్పారావుకు రూ.1.20లక్షలు, రంగిరీజు వీధికి చెందిన నిరీక్షణకు రూ.2 లక్షలు, గాజులరేగకు చెందిన శ్రీరాములునాయుడుకు రూ.1.60లక్షలు చెక్కులను అందజేశారు.

25వ డివిజన్‌లో గడప గడపకూ..

నగరంలోని 25వ డివిజన్ గడపగడపకు మన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిన లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్ లను అందజేశారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి నాయకులు బలివాడ కాశీపతిరావు, కిరణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు పెన్నిధి

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-రామభద్రపురం

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఆరోగ్య ప్రదాతని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం రామభద్రపురం సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో ఆయన ప్రారంభించారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రజలకు అందించే సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ఇళ్ల పట్టాలు పంపిణీ

పేదవారందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శంబంగి ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి, వైసిపి నాయకులు వెంకటరావు పాల్గొన్నారు.

జిందాల్ భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని మూలబొడ్డవర వద్ద ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన జిందాల్ భూనిర్వాసిత రైతుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. భూసేకరణ చేపట్టి 15 ఏళ్ల గడిచినా పరిశ్రమ ఏర్పాటు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఐ.సుధారాజు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, సర్పంచులు జి.సంతోషకుమారి, వై.రమణ, ఎంపిటిసి బోడ దేముడు, వైస్-సర్పంచ్ సూర్యనారాయణ, బొడ్డేటి అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పెదతాడివాడ గ్రామంలో ఎస్‌సి కాలనీ వద్ద ఆర్అండ్‌బి రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్తులు శుక్రవారం సచివాలయంలో కార్యదర్శికి, వీఆర్ఒకు ఫిర్యాదుచేశారు. సర్వే నంబరు 105-2లోని ప్రభుత్వ భూమిలో 105-3లో రిజిస్ట్రేషన్ చేసుకుని కొలుసూరి సత్యవరప్రసాద్, గొట్టుముక్కల సూర్యనారాయణ ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఆక్రమణలను అడ్డుకోవాలని మందిన సురేష్, కోరాడ రమణ, పడాల చిన్నారావు, డి.గౌరీ ప్రసాద్, ఆర్.తాతాయుడు కోరారు.


ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

వాలంటీర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నల్లబిల్లిలో నూతనంగా నియమించిన గ్రామ వాలంటీర్లకు శుక్రవారం ఎంపిపి డి.సత్యవంతుడు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉమ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని టి.బూర్జవలస గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో కరిశెట్టి ఆదినారాయణ పూరిల్లు కాలిపోయి, సర్వం కోల్పోయారు. దీంతో ఆ కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాన్లు, దుప్పట్లను సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, మాజీ ఎంపిపి బెజవాడ రాజేశ్వరి అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి ఎం.రాము, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

మోహినికి అభినందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన బీల మోహిని ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గతేడాది గొంప కృష్ణ విద్యా సంకల్పంలో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ పోస్టుకు ఎంపికైన మోహినిని గొంప కృష్ణ అభినందించారు. నియోజకవర్గ పరిధిలోని యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే తన లక్ష్యమని కృష్ణ తెలిపారు.

టిడిపిని ఆశీర్వదించండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపిని ప్రజలు ఆశీర్వదించాలని విజయనగరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి అతిథి గజపతి కోరారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 6వ డివిజన్ జమ్ము లో అదితి గజపతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమం తీవ్రం

ప్రజాశక్తి -విజయనగరం కోట

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఎంపియస్ ఆర్టీసీ ఎన్ఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం స్థానిక స్థానిక ఆర్‌టిసి జోనల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత మూడు నెలలుగా జోన్ మొత్తం ఉద్యమం జరుగుతున్నా యాజమాన్యం నిమ్మక నేరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. 2019 సర్కులర్ అమలు చేయాలని, ఉద్యమంపై అధికారులు కక్ష సాధింపు చర్యలు చేపట్టడం వీడనాడాలని, ఉద్యోగులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పివి మోహన్, రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు, జోనల్ అధ్యక్ష కార్యదర్శులు ప్రదీప్ కుమార్, ఎంవిఆర్ మూర్తి, జిల్లా అధ్యక్షులు పీజీ రాఫెల్, బిఎస్ రాములు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు సాయం

ప్రజాశక్తి-డెంకాడ

జొన్నాడ సచివాలయంలో పది మంది క్షయరోగులకు సర్పంచ్ కోరాడ రమణి కోటినాయుడు సొంత నిధులను పౌష్టికాహార కిట్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మోపాడ వైద్యాధికారి, ఎంపిహెచ్ఎస్ ఎస్.సూరిబాబు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఘటనా స్థలంలో బంగార్రాజు మృతదేహం

లగేజీ ఆటో, బైక్ ఢీ

వ్యక్తి మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ సమీపంలో శుక్రవారం లగేజీ ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... విజయనగరంలోని ధర్మపురి గ్రామానికి చెందిన శీలవలస బంగార్రాజు (35) పూసపాటిరేగ మండలం నడిపల్లిలో అత్తారింటికి బైక్‌పై వెళు తున్నాడు. నాతవలస నుంచి విజయనగరం వైపు వస్తున్న లగేజీ, బైక్ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో బంగార్రాజుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బంగార్రాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేశారు.

25వ రోజూ నిరసనల హోరు

కొనసాగుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె


విజయనగరం.. సమ్మె 25రోజులకు చేరిన నేపథ్యంలో 25 ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనీస వేతనాలు అమలు చేయాలని, గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలోఅంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 25 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట 25 సంఖ్య రూపంలో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడారు. మహిళా పక్షపాతి ప్రభుత్వమని చెప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తాము కనిపించలేదా అని ప్రశ్నించారు. 25 రోజులుగా మహిళలు కుటుంబాలను వదిలి రోడ్డు మీద ఉంటే సమస్యలు పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వం,ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వేతనాలు పెంచే వరకు అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు సమ్మె విరమించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గజపతినగరం : అంగన్వాడీల సమ్మె శిబిరంలో చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అంటూ అంగన్వాడీలంతా కళ్లు, చెవులు, నోరు మూసుకొని నిరసన తెలిపారు. అంతకుముందు సోది చెబుతామంటూ సోది చెప్పినమ్మ, ముఖ్యమంత్రి, మంత్రులు అంగన్వాడీల మధ్య సంభాషణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.సుభాషిని, సెక్టారు నాయకులు నాగమని, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ మద్దతుతెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి సూర్యనారాయణ, యూనియన్ నాయకులు కృష్ణవేణి, కొర్లమ్మ, అనిత, శ్రీదేవి, ప్రవీణ పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మెకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యాన నాలుగు మండలాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహంతి చిన్నం నాయుడు, పతివాడ తమ్మినాయుడు, భోగాపురం, పూసపాటిరేగ మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు బంగార్రాజు, మహంతి శంకర్రావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనాయుడు, న్యాయవాది పతివాడ అప్పలనాయుడు, నాయకులు ఇజ్జరోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : అంగన్వాడీల సమ్మెకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. సమ్మెకు ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య శుక్రవారం మద్దతు తెలిపారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు చెలికాని ముత్యాలు, యూనియన్ నాయకులు డి.శ్యామల, డి. శ్రీలక్ష్మి, వి.మాణిక్యం కె సుశీల తదితరులు పాల్గొన్నారు.


గజపతినగరం... నోరు, కళ్లు, చెవులు మూసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

రామభద్రపురం : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరం 25వ రోజు కొనసాగింది. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, రాధమ్మ, కుమారి పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ ఎన్నికల సమయంలో లబ్ది కోసం హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై ఉందన్నారు. అంగన్వాడీలు, మున్సిపల్, సమగ్రశిక్ష ఉద్యోగులు సహకరించకుండా ఐదేళ్లు పాలన చేశారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజాం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరంలో పొర్లు దండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తి నాయుడు, యూనియన్ నాయకులు ఉమాకుమారి, సత్యవతి, వరలక్ష్మి, లక్ష్మి, సునీత, శ్రీదేవి పాల్గొన్నారు.


బొబ్బిలి.. అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు


రామభద్రపురం.. సమ్మె శిబిరంలో పాల్గొన్న అంగన్వాడీలు

ఎందుకంత ఉదాసీనత?


దాతలు చదును చేయకముందు గురుకులం మైదానం (ఫైల్)

ప్రజాశక్తి-వేపాడ

ఆయనో మండల స్థాయి అధికారి. చేయని పనిని చేసినట్లు చూపించడంలో, ఉన్నతాధికారులను 'మేనేజ్' చేయడంలో దిట్ట. అందుకే ఆయన ఎన్ని తప్పులు చేసినా, కింది స్థాయి ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. పైగా ఆ అధికారికి వంత పాడుతుంటారు. కలెక్టర్ సైతం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినా, మసిపూసి మారేడు కాయ చేసి ఆయన్ను కాపాడుకుంటూ వస్తున్నారు. పైపెచ్చు ప్రజాప్రతినిధులకు భజన చేయడంలో ఆయనది అందెవేసిన చేయి. స్వామిభక్తి చూపిస్తుండటంతో ఆయన ఎన్ని తప్పులు చేస్తున్నా, ఎన్ని లోపాలున్నా ఏమీ అనడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఆయన మండలంలో ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు.

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు
- దాతలు చేసిన పనులకు అంచనాలు
- సచివాలయ ఉద్యోగులపై వేధింపులు
- ఇష్టారాజ్యంగా మండల అధికారి తీరు
- ఫిర్యాదులొస్తున్నా చర్యలకు వెనుకడుగు వేస్తున్న ఉన్నతాధికారులు


ఇదిగో.. ఈ చిత్రాన్ని చూశారా! వేపాడ మండల కేంద్రం సమీపంలోని బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల ఆవరణమిది. సుమారు ఐదు ఎకరాలకు పైగా ఉన్నా ఆ ఆవరణమంతా ఆర్నెల్ల క్రితం ఇలా దట్టమైన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, బండరాళ్లతో భయంకరంగా ఉండేది. విద్యార్థినులు బయటకు వెళ్లాలంటేనే భయపడిపోయే వారు. విద్యార్థుల బాధలు విన్న ఓ సామాజిక కార్యకర్త, ఎస్ఎఫ్ఐ నాయకులు స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో వేపాడ మండల స్థాయి కీలక అధికారి.. పది మంది కూలీలను పెట్టి, గంట గంటలపాటు పనిచేయించి, ఐదు ఎకరాలకు పైగా ఉన్న మైదానం బాగుచేసినట్లు నివేదిక పంపించారు. తీరా చూస్తే.., ఎక్కడి తుప్పలు, డొంకలు, ముళ్లపొదలు అక్కడే ఉన్నాయి. ఆ మండల స్థాయి అధికారి తప్పుడు నివేదిక పంపినట్లు రుజువై నెలలు గడుస్తున్నా నేటికీ చర్యలు తీసుకోలేదు.

అధికారులు ఎలాగూ పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు కూడా తమకేమీ సంబంధం లేదన్నట్లు వదిలేశారు. గురుకులం ఆవరణలో పాములు, విషకీటకాల సంచారంతో విద్యార్థినులు సతమతం అయ్యేవారు. దీంతో అదే సామాజిక కార్యకర్త దాతల సాయంతో ఆ మైదానాన్ని చదును చేయించారు. దాతల సాయంతో చేసిన పనులకు, అదే అధికారి అంచనాలు రూపొందించి వేసి, ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. దాతలు చేసిన పనులకు అంచనాలు వేయడం, ఆమోదం కోసం పంపించడం నేరమని తెలిసినా, ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమానో, మరేమో తెలియదు గానీ దానికీ తెగించారు. బిల్లులు మంజూరు చేయించుకుని, తన జేబు నింపుకోవాలన్న ఆలోచనతోనే ఆ అధికారి అలా చేశారన్న ఆరోపణలు వచ్చాయి.

ఎందుకు వెనుకాడుతున్నారో?

గురుకులంలో సమస్యలపైనా సామాజిక కార్యకర్త, ఎస్ఎఫ్ఐ నాయకులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిరసనలు కూడా చేపట్టారు. మరోవైపు మండల స్థాయి అధికారి చేసిన తప్పిదాలపై ఆధారాలతో సహా స్పందన కార్యక్రమంలో సామాజిక కార్యకర్త.. కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాలు ఆ అధికారికి కంటగింపుగా మారాయి. అందుకే సామాజిక కార్యకర్తను ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకుని ప్రజాప్రతినిధులను, నాయకులను, పలువురు ఉద్యోగులను ఆయనపై ఉసిగొల్పుతున్నారు. ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తూ, తప్పుడు నివేదిక అందజేసిన అధికారిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు కూడా ఆయన్ను వెనుకేసుకొస్తున్నారు. చర్యలకూ వెనుకడుగేస్తున్నారు. విద్యార్థినుల బాగోగుల కోసం పరితపించిన సామాజిక కార్యకర్తను వేధింపులకు గురిచేస్తున్నారు.


దాతలు చదును చేసిన తరువాత మైదానం


GOVERNMENT OF ANDHRA PRADESH
PANCHAYAT RAJ ENGINEERING DEPARTMENT

VIZIANAGARAM DISTRICT - AP

DETAILED ESTIMATE

NAME OF WORK :-		Earth work levelling and Jungle clearence KGBV SCHOOL at BN Peta in Vepada Mand
Estimate Amount	:	1.50 Lakhs
Grant	:	
Name of the Mandal	:	VEPADA
Name of the Sub-Division	:	PRI S.Kota
Name of the Division	:	PRI Vizianagaram
Name of the Circle	:	PR Vizianagaram
Admn Sanction Ref Date & No.	:	
Name of the Tech.no & date.	:	
Name of the Section	:	MEO Vepada
Date of Resolution	:	of the GP

దాతలు పని చేశాక అధికారులు పనులు చేసేందుకు వేసిన అంచనాపత్రం

కలెక్టర్ స్పందించేనా?

జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పేద విద్యార్థినులు గురుకులంలో విద్యనభ్యశిస్తున్నారు. ప్రభుత్వ విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని సిఎం మొదలుకొని మండల స్థాయిలో ప్రజాప్రతినిధి వరకు అందరూ తరచూ చెబుతుంటారు. ఏళ్ల తరబడి గురుకులంలో విద్యార్థులు ఆట స్థలం లేక, తుప్పలు డొంకలతో కూడిన ఆవరణంతో భయం భయంగా గడుపుతుంటే ఏ ఒక్కరూ చర్యలు తీసుకోలేదు. విద్యార్థినుల సమస్యలపై స్పందించిన సామాజిక కార్యకర్తపై, సాయం చేసిన దాతలపై అదే మండల స్థాయి కీలక అధికారి వేధింపులకు దిగడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం, కలెక్టర్ జోక్యం చేసుకుని గురుకులంలో సమస్యలను పరిష్కరించాలని, తప్పుడు నివేదిక పంపించి, ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అవ్వా తాతలను ఆదుకున్న ప్రభుత్వం


జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


శృంగవరపుకోట... పింఛను డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -రేగిడి

అవ్వా తాతలకు పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అంబకండి గ్రామంలో పెంచిన రూ.3 వేల పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీచేశారు. ముందుగా జగన్ చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ తలే రాజేష్‌కు అంతా మద్దతు తెలపాలని ఆయన కోరారు. అనంతరం హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తలే రాజేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వి.జగన్మోహన్ రావు, వైసిపి నాయకులు కింజరాపు సురేష్ కుమార్, లెంక రాంబాబు, శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సిరిపురం జగన్మోహనరావు, సోషల్ మీడియా కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిడిఒ శ్యామలకుమారి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి హేమ సుందర్ రావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి జగనేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని నూతనంగా మంజూరైన 168 పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం రూ.3 వేలు పింఛను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, వైఎస్ ఎంపిపి ఎన్.సత్యనారాయణ రాజు, పిఎసిఎస్ చైర్మన్ మహంతి లక్ష్మణరావు, నాయకులు మహంతి జనార్ధనరావు, దాడిశెట్టి త్రినాథరావు, యడ్ల రామకృష్ణ, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, ఎస్.శ్రీనివాసరావు, సర్పంచి టి.సీతారాం, ఎంపిడిఒ రాధిక, తహశీల్దార్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



రేగిడి.. పింఛను నగదు అందిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి : పట్టణంలోని పదో సచివాలయంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ చెలికాని మురళి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు.

వేపాడ : మండలంలో కుంపల్లి, కెఆర్‌పేట, వీలుపర్తి, వేపాడ, ఆతవ, సింగరాయి, డి.ఆర్.పేట, వల్లంపూడి గ్రామాల్లో పెంచిన పింఛన్లను ఎంపిపి డి.సత్యవంతుడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటరావు, సర్పంచులు ఎల్.అరుణ, సిహెచ్ ముసలినాయుడు, మెల్లిపాక అర్జునమ్మ, రుద్ర అంజలి, డి.ముత్యాలమ్మ, ఎన్.వెంకటరావు, పంచాయతీ కార్యదర్శులు కమల, బి.గౌరి, ధనలక్ష్మి, కన్నమ నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గు బాబు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాకాడ రాంబాబు, కూనిరెడ్డి వెంకటరావు, మోపాడ కుమార్, రంది అనంత్, ఎంపిడిఒ శేషుబాబు, బుగత వెంకటేశ్వరరావు, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

లక్కవరపుకోట : నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు ఎంపిపి గేదెల శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మల్లివీడు పంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. వికలాంగులైన బూసాల సత్యరాజ్, బొడ్డు చల్లయ్య, కెల్ల సూరికి విద్యుత్తు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లివీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, వైసిపి నాయకులు జామి రాజు, గేదెల విజయకుమార్, అమనాపు శ్రీనివాసరావు, పెదిరెడ్ల వెంకటేష్, జామి ఈశ్వరరావు, కసిరెడ్డి కృష్ణ, పంచాయితీ కార్యదర్శి అల్లు సుభద్ర పాల్గొన్నారు.


వేపాడ.. పింఛను నగదు అందిస్తున్న ఎంపిపి సత్యవంతుడు


పూసపాటిరేగ.. పింఛను నగదు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల : ప్రజా సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో పెంచిన రూ.3 వేల పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం వైకెపి ఆధ్వర్యంలో ఉన్నతి పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల నుంచి గుషిని గ్రామానికి చెందిన మానాపురం లక్ష్మికి ఆటోను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, నగర పంచాయతీ చైర్మన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పి.సత్యనారాయణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తుమ్మలపేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, ఎంపిడిఒ జి.రామారావు, కమిషనర్ పి. బాలాజీప్రసాద్, గరివిడి ఏరియా కోఆర్డినేటర్ బంగారమ్మ, ఎపిఎం ఎల్.సత్యనారాయణ పాల్గొన్నారు.


లక్కవరపుకోట.. విద్యుత్తు ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీనివాసరావు